క్లుప్తంగా

బదిలీలలో న్యాయం జరగలేదు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్నార్టీసీ కడప జోన్, రీజియన్ పరిధిలో జరిగిన బదిలీల్లో ఏ సెక్షన్‌కు న్యాయం జరగలేదని కార్మిక పరిషత్ జోనల్ కార్యదర్శి పురుషోత్తం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ బదిలీల్లో నిబంధనలు గాలికి వదిలేశారన్నారు. ఈడీ సమీక్షించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.
కడప కోటిరెడ్డి సర్కిల్: ఏపీఎస్నార్టీసీ కడప జోన్-4, కడప రీజియన్ వ్యాప్తంగా ఈ నెల 21న జరిగిన బదిలీల్లో అధికారులు ఏక పక్షంగా వ్యవహరించారని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎ.ఆర్.మూర్తి, రాము తెలిపారు. విలేకరులతో వారు మాట్లాడుతూ అధికారులు జీవో ప్రకారం ఐదేళ్ల పూర్తి చేసిన ఉద్యోగి కోరితే బదిలీ చేయాలనే నిబంధన బేఖాతరు చేశారని తెలిపారు. కొన్ని సెక్షన్లలో వెళ్లాలనుకున్న ఉద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి



చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా కడప శిల్పారామంలోని సాంస్కృతిక వేదికపై చిన్నారులు తమ ఆటపాటలతో అలరించారు. స్థానిక ముద్ర డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు పలు జాన పద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కాల్వల్లో స్వచ్ఛతాహీ సేవ



శుభ్రం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

వైవీయూ: కడప నగరంలోని కాల్వల్లో ఏబీవీపీ నాయకులు ఆదివారం స్వచ్ఛతాహీ సేవ నిర్వహించారు. వైవీయూ శాఖ ఆధ్వర్యంలో వినాయకుడిని నిమజ్జనం చేసిన కృష్ణ కాలువ ప్రాంతంలో వ్యర్థాలను తొలగించారు. ఏబీవీపీ వైవీయూశాఖ అధ్యక్షుడు హనీష్ మాట్లాడుతూ మన ప్రాంతాన్ని మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ కన్వీనర్ పుల్లయ్య, సోషల్ మీడియా కన్వీనర్ వి. కిరణ్‌కుమార్, జావిద్, అరవింద్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు

కడప కల్చరల్: బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని బాసట చిల్డ్రన్స్ హోమ్ చిన్నారులకు ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు జి.శ్రీనివాసులు బాలలకు వైద్య పరీక్షలు నిర్వహించి ప్రాథమిక స్థాయిలో చికిత్స చేసి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతతో అనేక వ్యాధుల్ని నివారించుకోవచ్చని సూచించారు.

రాజుపాళెం సర్వేయర్‌గా విజయభాస్కర్

రాజుపాళెం: రాజుపాళెం సర్వేయర్‌గా ఆర్.విజయభాస్కర్ నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న సర్వేయర్ గురుశేఖర్ జమ్మలమడుగు తహసీల్దారు కార్యాలయానికి బదిలీ అయ్యారు. విజయభాస్కర్ బి.కోడూరు మండలం నుంచి ఇక్కడికి వస్తున్నారు. త్వరలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

టీటీడీలో అవినీతిపై సీబీఐ విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న ఆర్ఎస్‌యూ నాయకులు

వైవీయూ: టీటీడీలో జరిగిన అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి కోరారు. కడప నగరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధ సంస్థ టీటీడీలో గతంలో జరిగిన అవకతకలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి టీటీడీ పవిత్రతను దెబ్బతీసే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ప్రశాంత్, హరిబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: బద్వేల్ పట్టణంలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థిని మహిమను కొట్టిన ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి అన్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆయన ఆదివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర సభ్యులు రాజేష్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

నగర ఉద్యానం
లోహం అధ్వానం







శిల్పారామంలో ఆకట్టుకుంటున్న లోహ శిల్పాలు కాలం కాటుతో తుప్పుపట్టి వికృతంగా తయారయ్యాయి. 2016లో బద్వేల్ శిల్పకారుడు గొల్లపల్లి జయన్న నేతృత్వంలో పది మంది కళాకారులు మెకానిక్ షెడ్‌లో పనికిరాని ఇనుప తుక్కు సామగ్రితో అందమైన కళాకృతులను తయారు చేశారు. ఆకర్షణీయమైన ఆకారాలు కల్పించి జీవ కళ ఉట్టిపడేట్లు ఉండడంతో సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. ప్రస్తుతం ఇవి తుప్పు పట్టి ఆకారాలు చెడిపోయి వికృతంగా తయారయ్యాయి. మరమ్మత్తులైనా చేయాలని, లేదా వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయాలని సందర్శకులు కోరుతున్నారు. – కడప కల్చరల్

ఉక్కు ఫ్యాక్టరీ, సాగునీటి కోసం నిలదీయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం యువత, నీళ్ల కోసం రైతులు ప్రభుత్వాన్ని నిలదీయాలని అఖిలపక్ష నాయకులు సత్తార్, సీఆర్‌వీ ప్రసాద్, నారాయణ డిమాండ్ చేశారు. కడప నగరంలోని అఖిలపక్ష కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు సమావేశమై భవిష్యత్తు కార్యక్రమాలపైన ఆదివారం ప్రణాళిక రూపొందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నమ్మించి నట్టేట ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా ప్రభుత్వ సంస్థలన్నిటినీ ప్రైవేటుపరం చేస్తూ నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు చట్టాల పేరుతో ఇప్పటికే రైతులను ముంచే ప్రయత్నం చేశారని, కాబట్టి కార్మికులందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న కడప ఉక్కు కర్మాగారాన్ని, కడప బెంగళూరు రైల్వే లైన్ త్వరగా పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు ట్రాన్స్‌పోర్ట్ సులభతరం అవుతుందని తెలిపారు. రావాల్సిన నికరజలాలను సాధించుకునేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంజి, సగిలిగురప్ప, దేవర శ్రీకృష్ణ, పాపిరెడ్డి, సుబ్బరాయుడు, ఓబులేష్ యాదవ్, దస్తగిరి, మైనుద్దీన్, లెనిన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డీఎంఏ డీడీగా వైఓ.నందన్

కడప కార్పొరేషన్: గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్ వైఓ నందన్‌ను డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) వైస్ ఛైర్మన్‌గా ఉన్న ఆయనకు ప్రభుత్వం కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఇటీవల పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. కొన్ని రోజులకే కుడా వైస్ ఛైర్మన్‌గా బదిలీ చేసి సీడీఎంఏలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. విజయవాడలో వరదలు రావడంతో ఆయన కడప నగరపాలక సంస్థ తరపున బాధితులను ఆదుకునేందుకు తన వంతు కృషి చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వైఓ నందన్‌ను డీఎంఏ డీడీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులివ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆర్థిక సాయం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ముబారక్‌నగర్‌కు చెందిన షేక్ ఖాదర్‌వల్లి కుమార్తె షేక్‌సుబానీ వివాహం సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల ఆధ్వర్యంలో రూ.1.02 లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం ఖాదర్‌వల్లి ఇంటి వద్ద జరిగిన హల్దీ ఫంక్షన్‌లో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్ రెడ్డిలు వధువును ఆశీర్వదించి నగదుతో పాటు బట్టలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖాదర్‌వల్లి నిరుపేద కుటుంబానికి చెందినవారైనప్పటికీ పార్టీ తరపున జరిగే ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటుండేవాడన్నారు. అటువంటి కార్యకర్త ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి పార్టీ నాయకుల సహకారంతో ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, అట్లూరు మండల జేసీఎస్ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, మున్సిపాలిటీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, రెడ్డెయ్య, బాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో ఇసుక దొంగల హల్ చల్

వేంపల్లె : వేంపల్లెలో ఇంటి నిర్మాణం కోసం తోలుకున్న ఇసుకను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలిస్తున్నారు. దీంతో ఇంటి యాజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎద్దుల బండ్లు ద్వారా ఇంటి నిర్మాణాల కోసం ఇసుకను యాజమానులు తోలుకుంటున్నారు. దీని ఆసరా చేసుకుని కొందరు రాత్రి సమయంలో ఇంటి వద్ద ఉన్న ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు.

పగలు వచ్చి చూస్తే ఇసుక లేక పోవడంతో కూలీలు వెను తిరగాల్సి వస్తోంది. దీంతో ఇంటి నిర్మాణం చేసుకుంటున్న యాజమానులు భయాందోళనకు గురి అవుతున్నారు. రాయచోటి-పులివెందుల బైపాస్ రోడ్డులో మాలా అనే వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం నాలుగు ట్రాక్టర్ల ఇసుకను తోలించుకున్నాడు. ఇసుకను ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు పూర్తిగా దొంగలించారు. ఈవిధంగా గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. ఇటీవల కాలంలో పాపాఘ్ని నది నుండి ఇసుకను తరలించకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడం జరిగింది. ఈనేపథ్యంలో ఇంటి ముందు ఉన్న ఇసుకను తరలించేందుకు పాల్పడుతున్నారు. పోలీసులు గస్తీ పెంచి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు ఇంటి నిర్మాణ యజమానులు కోరుతున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని అమృతేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి తెలిపారు. పెన్నానది తీరంలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అమృతేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కొవ్వూ రు రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నామా రమేష్‌బాబు, సభ్యులుగా టంగుటూరు మారుతీ ప్రసాద్, నామా రమేష్ బాబు, కార్యదర్శిగా నామా వాసు, సహాయ కార్యదర్శులుగా వల్లంకొండు రఘు వంశీ, కళాసాగర్, కోశాధికారిగా విజయ్‌లను ఎన్నుకున్నారు.

విజిబుల్ పోలీసింగ్‌తో పటిష్ట భద్రత

ఎర్రగుంట్ల : జనాభా పెరుగుదలతో పాటు పట్టణాలు విస్తరిస్తుండటంతో భద్రతా అంశంలో పోలీసులతో పాటు ప్రజలు కూడా తమ సహకారిన్ని అందించాలని పోలీసుశాఖ సూచిస్తోంది. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని, అందులో భాగంగా అత్యాధునిక నిఘా నేత్రాలను ఇళ్ల వద్ద, దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకోవాలని కోరుతోంది. విజిబుల్ పోలిసింగ్‌తో చోరీలకు, నేరాలకు పాల్పడే వారిని త్వరతగతిన పట్టుకునేందుకు వీలుంటుందని తద్వారా నేరాలను అదుపుచేయవచ్చని భావిస్తోంది. దీంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారి ఆదేశాల మేరకు పోలీసులు నిఘా నిమిత్తం నూతనంగా సిద్ధం చేసిన సీసీ కెమెరాల ఆవశ్యకతను ప్రజలకు, దుకాణదారులకు వివరించే ప్రయత్నాలు చేపట్టారు. ఇదివరలో ఉపయోగించిన ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు నేరాల నియంత్రణలో సాయపడుతూ వచ్చాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా అమర్చబడిన సీసీ టీవీ కెమెరాలు మరింత ప్రభావవంతంగా పనిచేస్తున్నాయని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. సాంకేతికతను సరైన విధంగా ఉపయోగించడంలో ప్రజలు తమ ఆస్తులను కాపాడుకోవడంతో ఒక భాగమవుతారు.



ఆధునిక సీసీ కెమెరాలు

ప్రజల సహకారం ఉన్నప్పుడే సమాజం భద్రంగా ఉంటుంది. కొంత ఖర్చుతో కూడినదే అయినా భద్రతా పరంగా అది అవసరం కనుక ఏర్పాటు చేసుకోకతప్పదు.

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు

ఇటీవల జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం నియోజకవర్గాల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రతిఒక్కరు సీసీకెమెరాలను వినియోగిస్తే అనుమానితులను గుర్తించడంలో, నేర స్థలాలను పర్యవేక్షించడంతో, సాక్ష్యాలను సేకరించడంలో ఇవి ప్రధాన భూమికను పోషిస్తాయి. కెమెరాల ద్వారా పొందిన సాక్ష్యాలు న్యాయ ప్రక్రియలో కీలకంగా ఉంటాయి. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిన గుర్తించడంలో పట్టణ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పర్యవేక్షించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి.

పలు రకాల సీసీ కెమెరాలు..

ఏదో ఒక సీసీ కెమెరాను ఇళ్లకు, దుకాణాలకు అమర్చడంలో ప్రయోజనం ఉండదు. ఎలాంటి కెమెరాలు వాడితే అత్యధిక ప్రయోజనం ఉంటుందో పోలీసులు పలు సూచనలు ఇస్తున్నారు. వారు అందించిన సూచనల మేరకు బయటి వైపు ఉంచే కెమెరాల్లో టీపో క్రిస్టల్ క్లియర్ 2కె క్యూహెచ్‌డీ పరిజ్ఞానం ఉన్న స్మార్ట్ హోమ్ సెక్యూరిటీ కెమెరాలు అమర్చుకోవాలి. ఈ కెమెరాల్లో నైట్ విజన్, మోషన్ డిటెక్షన్, టూవే ఆడియో, స్టోరేజ్ ఆప్షన్, ఎలక్ట్రానిక్ పాస్ సౌకర్యాలు ఉంటాయి. దీంతో నేరస్తులను సులభంగా పట్టుకోవచ్చు. అలాగే లోపలవైపు ఉంచే కెమెరాల్లో పాన్ సెక్యూరిటీ వైఫై స్మార్ట్ పరిజ్ఞానంలో గానీ, 4జీ సిమ్ ఆధారంగా వైఫైతో పనిచేసే 3ఎంపీ స్మార్ట్ కేమెట్ హైబ్రిడ్ పరిజ్ఞానం గానీ ఉండాలి. ఈ కెమెరాల్లో పాన్‌ఫీచర్, హై రెజల్యూషన్, వైఫై కెనెక్టివిటీ, నైట్ విజన్, టూవే ఆడియో ఉంటుంది. ఇవి దుకాణాలకు ఉపయోగపడుతాయి.

బొప్పాయి పండు.. లాభాలు మెండు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటి వద్ద లభించే బొప్పాయి ఎన్నో ఔషధ గుణాలు కలిగి ఉంది. జ్వరం, కేన్సర్‌తోపాటు ఇతర వ్యాధులకు బొప్పాయి పండు, ఆకు రసం దివ్యౌషధంగా పనిచేస్తోంది. ఈ పండు తిన్న వారికి ఔషధ గుణాలు మెండుగా లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు.



బొప్పాయి ఆకు రసంతో రక్తకణాల వృద్ధి

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలో డెంగీ జ్వరాలతో బాధితులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. జ్వరంతో ఉన్నపాటుగా రక్త కణాలు తగ్గి ప్రాణాలు కోల్పోవడం జరుగుతోంది. అయితే రక్త కణాలు వృద్ధి చేయడంలో బొప్పాయి పండు కీలక పాత్ర పోషిస్తోందని వైద్యులు చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ బొప్పాయి పండు తినాలని, రసం, మంచి నీరు ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు. డెంగీకి ఇదే సరైన వైద్యం అంటూ చెబుతున్నారు.

డెంగీ వృద్ధి ఇలా

ఇంటి వద్ద నీటి నిల్వలు, పాత వస్తువుల్లో నీరు చేరి ఈజిప్ట్ దోమ వృద్ధి చెందుతుంది. ఈ దోమ మూడు అడుగుల ఎత్తు మాత్రమే ఎగరగలదు. అందువల్ల శరీరంలోని కింది భాగాలను మాత్రమే కుడుతుంది. ఇది కుట్టిన వెంటనే జ్వరం, ఒంటి నొప్పులు, కడుపులో మంట, కళ్ల మంటలు, వాంతులు, చర్మంపై దద్దుర్లు, తలనొప్పి, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వారం రోజులపాటు జ్వరం పీడిస్తుంది. బొప్పాయితోపాటు అధిక నీరు తీసుకోవడంతో ఈ జ్వరం తగ్గిపోతుందని వైద్యులు చెబుతున్నారు.

బొప్పాయితో మందుల తయారీ

ఫార్మా కంపెనీలు బొప్పాయి, ఆకులతో మందులను తయారు చేసి ఆస్పత్రులకు విక్రయిస్తున్నారు. చౌకగా లభించే బొప్పాయి ఆకు కంపెనీల ద్వారా మందుల రూపంలో కొనుగోలు చేయాల్సిన దుస్థితి. అలా కాకుండా ఇంట్లోనే బొప్పాయి పండు తినడం, వాటి ఆకులను కత్తిరించుకుని జ్యూస్ చేసుకోవడం, లేదా నీటిలో ఉడకబెట్టి తాగడం రోజుకు రెండుసార్లు చేయాలి. ఒక్కొక్కసారి 20 మిల్లీలీటర్ల రసాన్ని తీసుకోవాలి. రసం రుచిగా ఉండేందుకు తేనె, నిమ్మ రసం కలుపుకొని తాగవచ్చు. ఆకురసంలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండడంతో రోగ నిరోధశక్తి పెరుగుతుంది. దీని ద్వారా జీర్ణక్రియతోపాటు రక్తంలోని ప్లేట్‌లెట్లను వృద్ధిచేయడంలో కీలకపాత్ర పోషిస్తోంది. కేన్సర్, అజీర్ణం, గ్యాస్, మలబద్ధకం, జలుబు, దగ్గు, జ్వరం, కీళ్ల నొప్పులు, వాపులు వంటి రోగాలను బొప్పాయి నియంత్రిస్తుంది.

వైద్యుల సూచనల మేరకే వాడాలి



వైద్యులు సూచించిన మేరకే బొప్పాయి పండు, ఆకు రసం వినియోగించుకోవాలి. తక్కువ మోతాదులో ప్రతి రోజూ పండు తినడం, అధికంగా నీరు తాగడం మంచిది. ఆకు రసం తీసుకునే ముందు వైద్యుల సలహాలు తీసుకోవాలి. డెంగీ జ్వర బాధితులతో పాటు పలు వ్యాధులకు బొప్పాయి ఆకు రసం ఉపయోగపడుతుంది. దీన్ని వినియోగించుకోవడం శ్రేయస్కరం. – డాక్టర్ కరుణాకర్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, కడప

విటమిన్లు పుష్కలం

గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా దొరికే బొప్పాయి పండులో విటమిన్-ఎ పుష్కలంగా ఉంటుంది. ఇది కంటి ఆరోగ్యాన్ని మెరుగు పరచడానికి ఉపయోగపడుతుంది. ఫైబర్ ఎక్కువగా ఉండడంతో పండు కొద్దిగా తిన్నా కడుపు నిండినట్లు తెలుస్తుంది. దీని ద్వారా శరీర బరువు తగ్గడంతోపాటు కొవ్వు పదార్థాలు దూరమవుతాయి. చక్కెర వ్యాధి ఉన్న వారికి ఆకు రసం, పండు ఎంతగానో ఉపయోగ పడుతుంది. జీర్ణక్రియను పెంచడం, బరువును తగ్గించడంలో ఈ పండు ఉపయోగకారి.

నేడు కలెక్టరేట్ ఎదుట బ్లాక్ డే



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీల నుంచి వ్యవసాయాన్ని కాపాడాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని వామపక్ష కార్మిక, రైతు సంఘాల జిల్లా నాయకులు నాగ సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోమవారం బ్లాక్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ సంపదను లూటీ చేస్తున్న బడా కార్పొరేట్ కంపెనీలు దేశం విడిచి వెళ్లిపోవాలంటూ నిరసన కార్యక్రమాలు ఉంటాయన్నారు. దేశంలో రైతులను రక్షించే విత్తన చట్టం లేదని, పంటల బీమా పథకాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో రైతుల ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయడాన్ని మోసగించడం దారుణమన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి, విభజన చట్టంలోని హామీలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బారెడ్డి, బాదుల్లా, చంద్రారెడ్డి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

టెర్రస్ గార్డెన్‌తో ఆరోగ్యకరమైన జీవనం



మొక్క అందజేస్తున్న సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ సభ్యులు

కడప కల్చరల్: టెర్రస్ గార్డెన్‌తో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ సభ్యులు సూష్మ, అలేఖ్య, కిరణ్, సుప్రియ పేర్కొన్నారు. కడప ఓం శాంతి నగర్‌లో ఆదివారం సీటీజీ సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై సేంద్రియ ఆరోగ్యవంతమైన గార్డెన్ ఏర్పాటు సంతోషకరమన్నారు. పట్టణాల్లో నివసిస్తున్న వారిలో ప్రత్యేకమైన సేంద్రీయ ఆహార వ్యవసాయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో టెర్రాస్ గార్డెన్‌ను విస్తృతం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సేంద్రియ పెంపకానికి సంబంధించి పలు రకాల కూరగాయలు, పండ్లు, పూల మొక్కలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో 60 మంది సభ్యులు పాల్గొన్నారు.

మహిళల భద్రత పాలకులదే



నూతన కార్యవర్గంతో యూనియన్ నాయకులు

కడప కల్చరల్: మహిళల భద్రతకు.. పాలకులదే బాధ్యత అని ఎల్ఐసీ కడప డివిజన్ జోనల్ ఉపాధ్యక్షురాలు ఎం.కామేశ్వరి అన్నారు. సంస్థ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన శ్రామిక మహిళా సదస్సులో ఆమె మాట్లాడుతూ కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం దారుణమని, రాజకీయాలకతీతంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్ఐసీ పరిరక్షణ, సేవల విషయంలో మహిళల భాగస్వామ్యం ప్రశంసనీయమని పేర్కొన్నారు. పాలసీదారులకు మేలు చేసేలా లైఫ్, హెల్త్ బీమా పాలసీల ప్రీమియంపై జీఎస్టీని తొలగిస్తూ కౌన్సిల్ సమావేశం నిర్ణయం తీసుకోవాలని కోరారు. అనంతరం కో కన్వీనర్ వసుప్రద, కన్వీనర్ అమీనా పర్వీన్ ఆధ్వర్యంలో కడప డివిజన్ శ్రామిక మహిళా కన్వీనర్‌గా వసుప్రద(పి-జీఎస్)ను ఎన్నుకున్నారు. కో కన్వీనర్లుగా శ్రీవాణి(కడప), పద్మ జాలత(కడప), శ్రీకృష్ణ(కడప), హరిప్రియ(నంద్యాల), లత(ఆదోని), శివనందిని(గుంతకల్), లక్ష్మీదేవి(ధర్మవరం)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్య శ్రీనివాస్, సుబ్బమ్మ, అరుణ, సునీత, తిరుపతయ్య, శ్రీనివాసన్, అవధానం శ్రీనివాస్, రఘునాథరెడ్డి తదితరులు మాట్లాడారు.

వరద బాధితులకు సామగ్రి పంపిణీ



వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దూదేకుల సంఘం ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్: విజయవాడ వరద బాధితులకు వస్తు సామగ్రి పంపిణీ చేశామని దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆయిల్‌మిల్ ఓబులేసు, రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇదాందుల్లా పేర్కొన్నారు. విజయవాడలోని ముంపు ప్రాంతాలైన పాత రాజరాజేశ్వరిపేట, గొల్లపూడి, బొమ్మసాని సుబ్బారావు నగర్ ప్రాంతాల్లో ఆదివారం వారు పర్యటించారు. అనంతరం బాధితుల ఇబ్బందులను గమనించి దుప్పట్లు, లుంగీలు, టవల్స్, చీరలతో కూడిన సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ఐ ఖాదరయ్య, టీచర్ అజ్మతుల్లా, మంటపంపల్లి బాషా, పోతుగంటి పేరయ్య పాల్గొన్నారు.

చురుగ్గా దసరా ఏర్పాట్లు



అమ్మవారిశాల వద్ద ఏర్పాటు చేస్తున్న పందిరి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో దసరా ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. అక్టోబర్ 3వ తేదీ నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో చలువ పందిళ్లు, ఆలయంలో సెట్టింగ్‌లు చేయడంతోపాటు శుభ్రపరుస్తున్నారు. పలు ప్రాంతాల కార్మికులు ఈ పనుల్లో నిమగ్న మయ్యారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్ రావు, ప్రతినిధులు సమావేశం నిర్వహించి పర్యవేక్షిస్తున్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

బి.కోడూరు : ఆక్రమణకు కాదేదీ అనర్హం అన్న చందంగా అధికారపార్టీ నాయకులు హవా నడుపుతున్నారు. కొండ ప్రాంతాలను సైతం ఆక్రమణలు చేసుకుని డోజర్లు, జేసీబీలతో చదును చేసి సొమ్ము చేసుకుంటున్నారు. నిన్నటి వరకు నీతులు చెప్పిన అధికారపార్టీ నాయకులు ఏకంగా కొండను సైతం ఆక్రమించుకుని దందా నడుపుతున్నారు. విషయం తెలిసిన రెవెన్యూ అధికారులు చేసేదేమీ లేక చోద్యం చేస్తున్నారు. మండలంలోని ఐత్రంపేట గ్రామపొలానికి చెందిన సర్వేనెంబర్ 2735లో సుమారు 120 ఎకరాల కొండ ప్రాంతానికి చెందిన భూమి ఉంది. అధికారపార్టీ నాయకులు కొంత మంది రెవెన్యూ అధికారులకు ముడుపులు చెల్లించుకుని దొడ్డి దారిన ఆన్‌లైన్ చేయించుకున్నారు. వారం రోజులుగా సాగు చేసుకుంటూ బద్వేలు, పోరుమామిళ్ల ప్రాంతాలకు చెందిన కొంత మంది నాయకులకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.ఐత్రంపేట పంచాయతీ పరిధిలో భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన సుమారు వంద మందికి పైగా ఉన్నప్పటికీ వారికి అందకుండా చూస్తున్నారు. భూమిని అర్హులైన లబ్ధిదారులకు అందించాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.